నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# హైదరాబాద్

ఆదివారం 3 డిసెంబర్ 2023
SUNDAY, DECEMBER 3, 2023 | HYDERABAD | పేజీలు : 8 PAGES



నగరంలోని లెక్కింపు కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్, నగర సీపీ సందీప్ శాండిల్య తదితరులు



భోగారంలోని హోలీమేరి కళాశాలలో పూర్తయిన కౌటింగ్ ఏర్పాట్లు (ఇన్‌సెట్‌లో) దోమలగూడలోని ఏవీ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

# టిక్..టిక్..టిక్

## కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

### మరికొద్ది గంటల్లో ఓటరు తీర్పు

- ఉదయం 5 గంటలకే లెక్కింపు కేంద్రాలకు అధికారులు
- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- సాయంత్రానికి కల్లా పూర్తి ఫలితాలు
- నియోజకవర్గానికి 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్లకు అదనం
- మొదట చార్మినార్ ఫలితం, చివరన శేరిలింగంపల్లి



**శాసనసభ ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది.** ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఓటరు తీర్పు మరికొద్ది గంటల్లో వెలువడనున్నది. పటిష్ట బందోబస్తు నడుమ ఓట్ల లెక్కింపునకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 గంటలకే అధికారులు లెక్కింపు కేంద్రాలకు చేరుకోనున్నారు. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానున్నది. నగరంలో తొలి ఫలితం చార్మినార్ నియోజకవర్గం నుంచి వచ్చే అవకాశం ఉండగా, చివరి ఫలితం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో వెల్లడికావచ్చు. హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 14 లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయగా, యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మిగిలిన 13 నియోజకవర్గాలకు విడిగా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును భోగారం హోలిమేరి కళాశాలలో నిర్వహిస్తారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న రంగారెడ్డి జిల్లాలో మహేశ్వరం నియోజకవర్గం కౌంటింగ్‌ను ఇబ్రహీంపట్నం పరిధిలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో, ఎల్బీనగర్ ఓట్ల లెక్కింపును సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో, శేరిలింగంపల్లి ఓట్లను గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో, రాజేంద్రనగర్ ఓట్లను అప్పా జంక్షన్ సమీపంలోని లార్డ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో చేపట్టనున్నారు.ఒక్కో నియోజకవర్గంలో తొలుత పోస్టల్ ఓట్లను లెక్కించి, ఆపై అన్ని రౌండ్ల ఫలితాలను పూర్తి చేస్తారు. తుది ఫలితం వెలువడిన తరువాతనే ఎన్నికల సంఘం విజేతను ప్రకటిస్తుంది. విజేతగా నిలిచిన అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తారు.

**- సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ)**

## మద్యం విక్రయాలు నేడు బంద్

సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ట్రై కమిషనరేట్ల పరిధిలో ఆదివారం మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను మూసివేస్తున్నట్లు పోలీసు కమిషనర్లు ఆదేశాలు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిషేధిత సమయంలో మద్యం విక్రయాలకు పాల్పడితే సంబంధిత మద్య దుకాణం లేదా బార్‌ల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. డ్రైడేలో మద్యం విక్రయాలు జరగకుండా ఆబ్కారీ శాఖ అధికారులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

## ట్రై కమిషనరేట్ల పరిధిలో 144 సెక్షన్

**ఆదివారం ఉ. 6గంటల నుంచి సోమవారం ఉ.6 గంటల వరకు**

సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో 144 సెక్షన్‌ను విధిస్తున్నట్లు పోలీసు కమిషనర్లు వెల్లడించారు. ట్రై కమిషనరేట్ల పరిధిలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు ర్యాలీలు, సభలు, సమావేశాలు, రాస్తారోకోలు నిర్వహించడం నిషేధమన్నారు. అంతే కాకుండా ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒక చోట గుమిగూడడం, ఊరేగింపుగా లేదా ర్యాలీగా వెళ్లడం నిషేధమని పోలీసు అధికారులు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

### హైదరాబాద్ జిల్లా

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | రౌండ్లు |
|---|---|---|
| ముషీరాబాద్ | 289 | 21 |
| మలక్‌పేట | 300 | 22 |
| అంబర్‌పేట | 239 | 18 |
| ఖైరతాబాద్ | 258 | 19 |
| జూబ్లీహిల్స్ | 352 | 26 |
| సనత్‌నగర్ | 229 | 17 |
| నాంపల్లి | 285 | 21 |
| కార్వాన్ | 324 | 24 |
| గోషామహల్ | 235 | 17 |
| చార్మినార్ | 202 | 15 |
| చాంద్రాయణగుట్ట | 321 | 23 |
| యాకుత్‌పురా | 339 | 25 |
| బహదూర్‌పురా | 288 | 21 |
| సికింద్రాబాద్ | 223 | 16 |
| కంటోన్మెంట్ | 235 | 17 |

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా

| | | |
|---|---|---|
| మేడ్చల్ | 584 | 21 |
| మల్కాజిగిరి | 429 | 21 |
| కుత్బుల్లాపూర్ 590 | 21 | |
| కూకట్‌పల్లి | 418 | 21 |
| ఉప్పల్ | 418 | 21 |

### రంగారెడ్డి జిల్లా (జీహెచ్‌ఎంసీ పరిధిలోని)

| | | |
|---|---|---|
| ఎల్బీనగర్ | 573 | 21 |
| మహేశ్వరం | 542 | 20 |
| రాజేంద్రనగర్ 542 | 20 | |
| శేరిలింగంపల్లి | 638 | 23 |